

# మా వారితో బజారుకు

*నండగిరి ఇందిరాదేవి*

"కాంతమ్మగారు పుచ్చొంకాయలు తెచ్చిందని, నీళ్లుకలిపిన కిరసనాయిలు పోయించుకుందని మహా చెబుతారు మునిమాణిక్యంగారు ఈ మగాళ్లకు చేతయినట్టు'' అని విసుక్కుంటున్నది మా శారద. ఒకరోజు వాళ్లింటి కెళ్లేటప్పటికి

"ఏం జరిగిందేమిటి?" అని అడిగాను

''ఏముంది! ఇవ్వాళ మా వారు బజారుకు

వేంచేశారు ఇల్లు పట్టనంత సామాను చేరవేశారు" అన్నది వెటకారంగా

"మంచిదేగా" అన్నాను, ఆమె వారిని మావారితో **మనసులో కంపేరు** చేసుకుంటూ.

"ఆ' మంచే'గడమంచె! మళ్లీ జన్మలో బజారెళ్లమని అనకుండాచేశారు" అన్నది.

"అయినా ఇవ్వాళ ఆదివారం గదుటే!" అన్నాను.

"అదే కొంప ముంచింది! ఆదివారం అన్నసంగతి ఓ స్నేహితుడు జ్ఞాపకం



చేసి ఆక్షనుకు వెడుతున్నానన్నాడు. పొర టుపాన 'మీరూ వెళ్లి ఒక సోఫా సెట్టు పట్టుకురండి' అన్నాను "అన్నది శారద.

"మరింకేం! పట్టుకొచ్చిఉంటారు" అన్నాను

"అయ్యో! రాత! సోఫా సెట్టు పట్టుకురావటంకాదు. ఆయనతో వెళ్ళి ఓ ఎక్సుపార్టీ జడ్జిమెంటుచేసి వొచ్చారు వీళ్లను చూసి ఏడవాలో నవ్వాలో తెలియటంలేదు" అన్నది కాస్త చికాకుగా

"అసలు సంగతి చెప్పవేం?" అన్నాను. ఆక్షను హాలులో జడ్జిమెంటు చేయటం అర్థంకాక

"వెళ్లారు ఆక్షనుకనే! ప్రొద్దుననగా వెళ్లినవారు టీ టైము దాటినా రాకపోతే ఎంతమంచి సెట్టు తెస్తున్నారో ఎన్ని హాల్సు తిరుగుతున్నారో. పాపం అనుకున్నాను


"మరి?"

"విను. చెపుతా ఆ పాత సెట్టు లోపల పడేయించి డ్రాయింగురూం అంతా సర్ది ఎదురుచూస్తుంటే ఇందాకనే వొచ్చారు 'లారీ మీద సామాను వస్తోంది! ఎక్కడ పెట్టిస్తావోమరి' అన్నారు ఇంతలో లారీ రానే వచ్చింది ఆదుర్దాగా వెళ్ళిచూద్దునుగదా ఆసామాను ఏమిటో, ఎందుకు పనికివస్తుందో ఏమీ అంతు పట్టలేదు గడకొయ్యలు దేరా మేకులు, ఓ పెద్ద కాన్వాసు బట్ట, ఓ నాలుగు చినిగిపోయిన బ్లాంకెట్లు, రెండు స్వెట్టర్లు ఓకట్ట ఖాకీ పాంట్లు. పడేసి ఆ లారీ వెళ్ళిపోయింది. నాకు మతిపోయినట్టయి ఇదంతా ఏమిటి అన్నట్టు వారికేసిచూసి. 'ఆక్షనుకు వెడతానంటిరిగా' అన్నాను. 'అవును. ఆక్షనుకే వెళ్ళాను. ఇదిచూడు. టెంటు—అంటే దేరా—ఈ మేకులు పాతేస్తే ఒక సెకండులో రూం—గది—అదీ పోర్టబుల్ గది ఇక్కడంటే ఇక్కడ—అక్కడంటే అక్కడ...' అని అంటూంటే 'నా తల మీద అన్నాను' అడుతగిలి. 'అహ! నీ తలమీద అయితే కుదరదు—నలుచదరంగా ఉన్న నేల ఎక్కడుంటే అక్కడ రూం తయారవుతుంది పిక్నిక్కుకు వెళ్ళినా తీసికెళ్ళవచ్చు పిల్లలకు పడకగది—నాకు ఆఫీసుగది—నీకు వంటగది ..'అని గుక్క తిప్పుకోకుండావాదించే లాయరులాగ చెపుతుంటే చికాకుపుట్టి—'ఆ చినిగిపోయిన బ్లాంకెట్లు, ఈ చిల్లులు పడ్డ స్వెట్టర్లు—ఈ మురికిపాంట్లు! అహహ! ఎంత బాగున్నాయి!' అన్నాను ఒళ్ళు మండిపోయి. అది వినిపించుకోకుండా 'అవి మిలిటరీ బ్లాంకెట్లు—బయట చస్తే దొరకవు అన్నీ కలిపి చాలాచవకగా వచ్చేశాయి' అన్నారు ఏంచేస్తాం! అవన్నీ, కట్టకట్టి లంబరురూములో పడేయించాను. 'Law is nothing but common sense' అంటారు. కాని అది మినహాయించిందే 'లా' అనిపిస్తోంది వీరివాలకం చూస్తుంటే! నీట్ విస్కీ తాగినట్టు ఆ 'లా' మోతాదు

హద్దులుదాటి ఎక్కువ పడుతోంది వారికి'' అన్నది, ఆమె వారు బజారు వెళ్ళిన వైనం విశదంగా విపులీకరిస్తూ ఆమె చెప్పింది విని రోలు పోయి మద్దెలతో మొరపెట్టుకున్నట్లు ఉందనుకొని నవ్వుకున్నాను

''అసలు జరిగిందేమిటంటే ఆ స్నేహితుడు ఈయనగారిని మిలిటరీ ఆక్షనుకు తీసికెళ్ళి చవకగా పోతున్నాయి కొనమని అనివుంటాడు రెండు వాదాలు వినటానికి అలవాటు పడినవారు అది ఖండించటానికి ఎవరూ లేకపొయ్యేటప్పటికి ఎక్సపార్టీ జడ్జిమెంటు చేసినట్టు ఆ కచరా అంతా కొనేశారు'' అన్నది శారద నిట్టూరుస్తూ

ఈ స్నేహితుడి సంగతి ఇట్లావుంటే మాకు ఇంకో స్నేహితుడున్నాడు ఆయన లాయరుగాని, జడ్జికాని కాదు కాబట్టి కాస్త ఇంటిపనుల మీద శ్రద్ధ కలిగిన మనిషి. అదీ విపరీతమే అనుకోండి' భార్య తెచ్చేవన్నీ అతి ప్రియంగా తెస్తుందని ఆయనకొక అపోహ! తనే శ్రమపడి బజారెళ్ళి ఒక్కొక్క దుకాణంలో గంట అయినా తెమలక ఉన్న గట్టాలన్ని దింపించి డజన్ల లెక్కన గ్రోసుల లెక్కన బేరం చేస్తాడు. ఆ షాపువాడు ఎన్నిగట్టాలు కొంటారోనని తమ ఫైల్సులో ఉన్న ధరలను రిఫరు చేసి చెపుతుంటారు విసుక్కోకుండా చివరకు ఆయన కొనేవి పావు డజను (మూడు అని అననే అనడు) బనియన్లో, ఓ గజం తువాల తుంపో, లేక



"భోంచేసేటప్పుడు చేతులు ఎందుకు కడుక్కోవాలమ్మా?"
"చేతులకుండే మురికి పోవడానికి బాబూ."
"ఆ మురికున్నచోట పౌడరు రాసేసుకుంటే చాలుకదమ్మా నీలాగ."

ఓ పావు పౌండు బిస్కట్లతోనో బయట పడతాడు. అదీ వాళ్ళమీద జాలేస్తే. లేకపోతే మీ ధరలు గిట్టటం లేదు అన్నముక్క చిరునవ్వుతో అనేసి జారుకుంటాడు

అసలు బజారెళ్ళటం, కావలిసినవి కొనుక్కోటం కూడా ఒక కళ గమనించారో లేదో' మా స్నేహితురాలి భర్తలాగా చేతులో డబ్బుండగానే కనపడ్డదేదో కొనుక్కు రాకుండా మనకేం కావాలి అని నిర్ణయించుకొని ఇతరుల దగ్గర చూసి ధర అదీ కనుక్కొని వెళ్ళాలి అట్లాకాకుండా ఎంత ధర ఎక్కువ పెడితే అంతమంచిదనుకునే కొందరికి నిజంగానే తాటాకులు కట్టి పంపిస్తారు షాపువాళ్ళు

ఇహ మా వారు బజారెళ్ళటం సంగతి చెపితినా ఓ కథయి కూచుంటుంది వారికి

ఈ గొడవలన్నీ తెలియక పోవటమే కాక, కొంత శ్రమ లేకపోవటం, కొంత తప్పించుకునే తత్వం రెండూ కలిసి వస్తున్నాయి సరే ఇప్పుడంటే ట్రాన్స్ఫరయింది కాని ఇక్కడున్నప్పుడన్నా బజారులో కనబడ్డ మామూలు పళ్ళు కాని, తమలపాకులు కాని తీసుకురావటం అలవాటేలేదు ఒక రోజు తెస్తేట — నాకు అలవాటయి రోజూ తెమ్మంటానట అదీ వారి భయం ' కూపస్థమండూకం లాగా కేవలం ఆఫీసులో కూచుని ఆర్డర్లు పడేయటం, జడ్జిమెంట్లు రాయటం తప్ప ఇంకేమీ తెలియని వారికి ట్రాన్స్ఫరు అవుతే పాపం ఎట్లావుంటారోనని దిగులయింది అయినా మన చేతిలో మాట కనుకనా ' పోనీ ఒంటరిగా ఉంటే నలుగురితో అవసరంపడి కాస్త ప్రపంచ జ్ఞానం (అంతమాట అనగూడదుకాని) అలవడుతుందని సరిపెట్టుకున్నాను వారు వెళ్లాక ఎట్లా ఉన్నారో ఏమోనని ఒకసారి పిల్లలకు సెలవులు వచ్చినప్పుడు మా అమ్మ దగ్గర వాళ్ళను వదిలేసి వెళ్ళాను వారి ఊరికి అక్కడపోయి చూద్దును గదా ఘనంగా వుంది వ్యవహారం' వండటానికి, వడ్డించటానికి, చేతులు కడిగించటానికి, తువాలందించటానికి, మనుషులే మనుషులు దొరగారి నోటినుంచి ఏం ముత్యాలు రాలుతయోనని కాచుకు కూచునే వాళ్ళను చూసి నేను లేకుండా వారికి గడవదన్న నా అభిమానం కాస్త దెబ్బతిన్నది. ఒకరోజు ఉదయం వంట వాడు రావటం ఆలస్యం అయ్యేసరికి పోనీ పెట్టేద్దామని కిందికివచ్చి చూస్తే స్టవు అంటించటానికి అగ్గిపెట్టె కనపడలేదు. అక్కడున్న ప్యూనును అడిగితే —

''వంట బాబుగారు ఇండెంటు రాయలేదు'' అన్నాడు

''అగ్గిపెట్టెకు ఇండెంటేమిటి ?'' అన్నాను

''ఆఫీసు ప్రొసీజరు'' అన్నాడు

సరేలే, ఏడిసినట్టే ఉందనుకొని ఓ అణా యిచ్చి పంపాను టీ పెట్టాక వెళ్ళిచూస్తే వారి టేబులుమీద పర్సనలు ఫైల్సు ఓ బుట్టనిండా ఉన్నాయి ఇండెట్లు, బిల్లులు, వోచర్లు, దొరవారి చాకలి పద్దు, దొరవారి ఇంటిలెక్క, అణాపయిసలతో వ్రాసిఉంది, ఆడిట్ ఇన్స్పెక్షనుకు సిద్ధంగా. ఇంకేం' బజారెళ్ళాల్సిన అవసరం, నలుగురితో మాట్లాడవలసిన అవసరం కలిగి మనిషి కాస్త మారుతారని నేననుకుంటూ వుంటే ఇల్లుకూడా ఆఫీసుకింద తయారయి, లేనిదో లెక్కచూసి చెడు అలవాటు నేర్పి పంపుతున్నారు వీళ్ళు అనిపించింది సరే ఆ కాగితాలు చూస్తుంటే, ''దొరవారి బనియన్లు చినిగిపోయినవి. ఒక అరడజను బనియన్లకు మంజూరు ఇప్పించవలసింది '' అని వ్రాసిఉంది 'సరే' నన్న ఓ సంతకం బహుశా అకౌంటెంటుది అయి వుంటుంది.

ఇంతలో వారు స్నానం చేసి వచ్చేవరకు బట్టలన్నింటితోపాటు కొన్ని చేతులున్నవి, కొన్ని చేతులులేనివి బనియన్లు పెట్టి ఉన్నాయి. ఒకటి వేసుకొని చూశారు పొట్టిపొట్టిగా పొట్టమీదికి పోయింది అది తొడుక్కొని దర్జాగా అద్దంముందు నిలబడ్డారు "సరిపోనట్టు ఉందికదూ ?" అన్నారు, కొంగుచాటున నవ్వుకుంటున్న నన్నుచూసి "ముక్కుకు చీమిడి, మురికిచెడ్డి ఉంటే చక్కగా మొద్దబ్బాయిలాగా ఉంటారు" అన్నాను రెండోది వేసుకుంటే అది ఇద్దరికి సరిపోను ఉంది పాపం వాళ్ళ బనియన్లంటే తెస్తారుకాని సైజెట్లా తెలుస్తుంది "ఇదంతా ఏం ఖర్మ' హాయిగా బజారెళ్ళి సరిగ్గా సైజుచూసి కొనుక్కోకూడదూ?" అన్నాను "ఆ' టైము లేదు" అంటారు

అదీ అయిందిలెండి' ఒకసారి పోరగా పోరగా బజారెళ్లారు సాక్సు కొనుక్కుందామని వెళ్ళక వెళ్ళక వెళ్ళి కొనుక్కోకుండానే తిరిగి వచ్చారు ఎందుకూ అంటే అంటారుగదా, "వాడు నన్ను మోసం చేయాలని చూశాడు తక్కువ రకమువి కూడా రూపాయిన్నర అన్నాడు నాకు తెలియదనుకొని అసలు సాక్సు ధర రెండణాలు" అన్నారు నాకు ఫక్కున నవ్వొచ్చింది "ఏం' నవ్వుతా వెందుకూ' రెండు రూపాయిలకు బూట్లు, రెండణాలకు సాక్సు, చిన్నప్పుడు ఎన్నో జతలు కొన్నాను" అన్నారు తన స్టేటుమెంటు



"ఈ వర్షం చూస్తే భయంగా ఉందోయ్. మా ఆవిడ ఏవో కొనుక్కోడానికి బజారు కెళ్లింది."
"పరవాలేదులేవోయ్, వర్షం అంత ఎక్కువగా, వుంటే వెలిసేదాకా ఏ షాపులోనో ఆగుతుందిలే"
"బాబోయ్! షాపులో ఆగిందంటే నా కొంప గుండం చెయ్యదూ!"

సరియయింది అన్నట్టు. "ఇంకా నయం! వాడితో ఆ మాట అన్నారు కాదు. 'ఏ యుగంలో వున్నావు నాయినా!' అని అడిగేవాడు" అన్నాను మరిట, ఒకాయన చాలా రోజులకిందట తపస్సుకు కూర్చున్నాడట ఏళ్ళు గడిచిపొయ్యే వరకు, అతని చుట్టూ పుట్టలు పెరిగిపొయ్యాయట మొన్న ఎప్పుడో ఆ పుట్టలో ఏదో కదిలినట్టవుతే త్రవ్వి చూశారట అందులోంచి గడ్డాలు మీసాలు పెరిగిపోయిన ఆ ఒకాయన కళ్ళు నులుముకుంటూ లేచి, "శ్రీ రాములవారు అడివినుంచి తిరిగి వొచ్చారా?" అని అడిగాడట అట్లావుంది మావారి బజారు ఇన్ఫర్మేషను

తామొక్కరూ వెడితే అదీ సంగతి.. కూడా వస్తారా అంటే సాధారణంగా

రానేరారు ఆ'లా' అనే జలస్ మిస్ట్రెస్ రానియ్యదు కాని ఒక్కసారి వచ్చారు బాబూ. ఆ అనుభవం కల్లోకూడా మరచి పోననుకోండి. తప్పికూడా వారిని బజారుకు తీసుకెళ్ళ గూడదని లెంపలు వాయించుకున్నానంటే నమ్మండి' అసలు ఏమయిందంటే—ఏదో పండుగొచ్చింది తల్చుకుంటే నవ్వొస్తుందికాని ఆరోజు నేను పడ్డ యాతన ఇంతా అంతా గాదు. అయితే పండుగకు పిల్లలకు ఏమన్నా బట్టలు కొందామని రమ్మన్నాను మొదట ఆ—ఊ—అన్నారు కాని మొండి కేసేవరకు దేవుడా అని కార్లో కూర్చు న్నారు దొరవారిని ఇంత సాగదీసే వరకు కాస్త చీకటికూడా పడింది దుకాణందగ్గర దిగమంటే, "ఆ మనుష్యులు, ఆ మర్యాదలు, ఆ నమస్కారముల నుండి రక్షించుదూ - కాస్త ప్రశాంతంగా కూచోనీ—" అని ఓ చెట్టుకింద దుకాణానికి పది గజాల దూరంలో కారు పార్కు చేసుకొని కూర్చున్నారు ఎంత తొందరపడ్డా దుకాణంలో నుంచి గంట రెండుగంటల దాకా తెమలలేక పోయ్యాను తీసుకున్న బట్టలన్నీ పాకింగు చేస్తుంటే ఆ షాపు మానేజరు ట్రేలో టీ తెచ్చి ఇంకో కప్పు కలిపి, "మేంసాబ్ డ్రైవరుకు దేకేఆతా" అని అక్కడున్న కుర్రాణ్ణి కేకేశాడు ఆ మాట వినేసరికి నాకు ముచ్చెమటలు పోసినయి 'కార్లో కూర్చున్నది డ్రైవరు కాదు ఈ బిల్లు చెల్లించే యజమాని' అని అతనితో చెప్ప టానికి అభిమాన మనిపించింది. నాతో పాటు దిగమంటే దిగనందుకు వారిమీద, తెలియక అనుకున్నా అంత మనిషిని పట్టుకొని డ్రైవరంటున్నాడని అతనిమీద కోపం కట్టలు తెంచుకుంది అయినా అదంతా దిగమింగి, "ఆ! డ్రైవరు కెందుకు! అక్కరలేదు" అన్నాను తడ బడుతూ అతడు ఇంకా అతివినయం చూపుతూ, "కుచ్ పర్వానహీ, బిచారా ఉస్కుబీ పీనేదీజీయే!" అంటూ మళ్లీ ఆ కుర్రాణ్ణి కేకేశాడు. డ్రైవరు టీ తాగ దంటే కూడా వినిపించుకోకుండా! ఏం చేయను! నాకు పై ప్రాణాలు పైన ఎగిరి పోతున్నాయి! కప్పు పట్టుకొని యముడి లాగా నిలబడ్డ ఆ కుర్రాణ్ణి చూస్తుంటే! "నీబొంద! వద్దంటే ఊరుకోరాదు!" అని మనసులో తిట్టుకొని, చివరకు గట్టిగా,"ఆడ్రైవరుకు డయాబిటీసుఉంది. చక్కెర వేసిన టీ తాగడు" అని నెత్తి నోరు కొట్టుకొని చెప్పేదాక వదల్లేదు. ఇంత అవస్థ నేను పడుతుంటే," దయ గల మేంసాబు," అని కాంప్లిమెంటు పడేశాడు రక్షించావులే అనుకోని ఆ పాకెట్ నేనే మోసుకొచ్చి కార్లోపడ్డాను. ఇట్లా నా ప్రాణం సగం కొరుక్కుతిని కుట్టిన తేలు గుణవంతురాలు లాగా కార్లో హాయిగా ఆలోచిస్తూ కూర్చున్నారువారు

మనవాళ్ళంటారే సామెత — వెళ్ళితే బ్రహ్మహత్య. వెళ్ళకపోతే గోహత్య లాగా వుంటుంది వీళ్ళు బజారెళ్ళటం. ★